## క్లుప్తంగా

### కన్నుల పండువగా రావులమ్మ జాతర



కె.పెదపూడిలో రావులమ్మ తల్లి

అంబాజీపేట: కె.పెదపూడి గ్రామంలోని రాజరాజేశ్వరి రావులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కన్నుల పండువలా నిర్వహించారు. అమ్మవారి పూజ ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. జాతరలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. మంగళవారం అమ్మవారి తీర్థం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

### అంతర్వేదిలో శాంతి కల్యాణం



శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో స్వామివారి శాంతి కల్యాణం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ప్రధాన అర్చకులు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### ఫామ్17సీ, ఐడీ కార్డు మాత్రమే తీసుకురావాలి



ఎస్సై సురేష్

మామిడికుదురు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు వచ్చే ఏజెంట్లు ఫామ్–17సీ, ఐడీ కార్డు, ఆధార్ కార్డు తప్ప మరే ఇతర వస్తువులు తీసుకు రాకూడదని నగరం ఎస్సై పి.సురేష్ సూచించారు. ఆయన సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మామిడికుదురు మండలం నుంచి కౌంటింగ్‌కు హాజరయ్యే ఏజెంట్లు ఈ సూచనలు పాటించాలన్నారు. సెల్‌ఫోన్లు, పెన్నులు తదితర వస్తువులను ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించే ప్రసక్తే లేదన్నారు. మద్యం సేవించిన వారిని కౌంటింగ్ కేంద్రంలోని అనుమతించరని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులకు సహకరించాలని ఎస్సై సురేష్ కోరారు.

### వైభవంగా పళ్లాలమ్మ జాతర



గ్రామదేవత పళ్లాలమ్మ తల్లి

మామిడికుదురు: మొగలికుదురు గ్రామం దేవత శ్రీపళ్లాలమ్మ జాతర మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. గరగ నృత్యాలు, విచిత్ర వేషధారణలు, మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ జాతర మహోత్సవం ఆద్యంతం కన్నుల పండుగలా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పలు రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. జాతర మహోత్సవాలు శుక్రవారం వరకు అయిదు రోజులు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. బుధవారం అమ్మవారికి నైవేద్యాలు చెల్లిస్తారని, అదే రోజు తీర్థం , సిరిబొమ్మ ఊరేగింపు జరుగుతాయన్నారు. 7వ తేదీ శుక్రవారం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశామని కమిటీ తెలిపింది.

### స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం



సోము రాజు కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే రాపాక తదితరులు

మలికిపురం: అనారోగ్య సమస్యతో స్నేహితుడు పెసింగి సోము రాజు( బట్టిలంక) కొన్ని రోజుల క్రితం మృతి చెందాడు. నిరుపేదలైన కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. ఇది గమనించిన తోటి స్నేహితులు, అందరూ కలసి సమకూర్చిన రూ. 50,000 ఆర్థిక సహాయాన్ని స్నేహితుని భార్యకు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు చేతుల మీదుగా అందజేశారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో రాజు చిత్ర పటానికి ఎమ్మెల్యే రాపాక పూలమాలలు వేసి నివాళులర్పించి సాయం అందించారు. రాపాక నవీన్, పెదపాటి అనిల్, ఓగురి స్టీవెన్, చెవ్వుకుల రాజు, గెడ్డం రవి, చొప్పల రాజేంద్ర, మంగేన సతీష్, గంట దిలీప్, చొప్పల భాను, మట్టా అనిల్, చింతా రమేష్ మరి గల్ఫ్ స్నేహితులు పాల్గొన్నారు.

# ఉత్కంఠకు నేటితో తెర

- పల్లెల్లో ఎక్కడికక్కడే చర్చలు
- ముమ్మిడివరానికి పయనమైన పార్టీ శ్రేణులు
- ఫలితాలను టీవీల్లో వీక్షించేందుకు ఏర్పాట్లు
- కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



చెయ్యేరు ఇంజినీరింగ్ కాలేజ్‌లోని కౌంటింగ్ హాలులో ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

కొత్తపేట: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరిగాక 21 రోజుల ఉత్కంఠకు నేటితో తెరపడనుంది. ఎన్నికల ఫలితాలు లెక్కింపునకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. సమయం సమీపిస్తున్న తరుణంలో ఎక్కడ ఏ ఇద్దరు, ముగ్గురు కలిసినా ఫలితాలపైనే చర్చలు జరుగుతున్నాయి. ఎవరు గెలుస్తారో? ఎంత మెజార్టీ వస్తుందో? అనే ఊహాజనిత ప్రచారాలు సాగుతున్నాయి.

రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికలు 4వ విడతలో గత నెల 13న జరగ్గా 11 రోజుల అనంతరం మంగళవారం ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ నేపథ్యంలో ఏ పార్టీ విజయం సాధిస్తుంది. అనే దానిపై రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తల్లోనే కాక ప్రజల్లో ఆసక్తి, ఉత్కంఠ నెలకొంది. నియోజకవర్గంలోని గ్రామాల ప్రతి కూడలిలో ఇదే చర్చ కొనసాగుతోంది.

జిల్లాలోనే కొత్తపేట రాజకీయ చైతన్యంతో ప్రత్యేకతను చాటుకునే నియోజకవర్గం. ఎప్పుడూ నువ్వా.. నేనా అన్నట్టుగా ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు పలు ఎన్నికల్లో స్వతంత్రులు కూడా ప్రధాన ప్రత్యర్థులుగా పోటీనిచ్చారు. ఇక్కడ 13 మంది పోటీలో ఉన్నప్పటికీ ప్రధానంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, టీడీపీ అభ్యర్థి బండారు సత్యానందరావుల మధ్యే పోటీ జరిగింది. ఈ నేపథ్యంలో ఫలానా అభ్యర్థి గెలిచేందుకు.. ఫలానా అభ్యర్థి ఓడిపోయేందుకు అవకాశాలు కనిపిస్తున్నాయి అనే ఊహాగానాలు.. అంచనాల్లో ప్రజలు తలమునకలయ్యారు.

**కౌంటింగ్‌కు సిద్ధం**

ముమ్మిడివరం సమీపాన శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల విశ్వేశ్వరయ్య బ్లాక్ మొదటి అంతస్తు రూమ్ నెంబర్ 1111లో అసెంబ్లీ అభ్యర్థుల ఓట్లు లెక్కింపు నిర్వహిస్తారు. ఈ నియోజకవర్గ పరిధిలోని ఎంపీ అభ్యర్థుల ఓట్ల లెక్కింపు అదే బ్లాక్, మొదటి అంతస్తులోని రూమ్ నెంబర్ 1108లో నిర్వహిస్తారు. ఆయా పార్టీల, స్వతంత్ర అభ్యర్థుల తరపున జనరల్ ఏజెంట్లు, సాధారణ ఏజెంట్లతో పాటు ప్రధాన నాయకులు కౌంటింగ్‌కు సోమవారం రాత్రికే ముమ్మిడివరం పయనమయ్యారు. ముమ్మిడివరం వెళ్లని వారు నియోజకవర్గంలోనే ఉండి స్వగృహాల్లో టీవీల ద్వారా ఫలితాల వీక్షణకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఎప్పటికప్పుడు స్థానిక నియోజకవర్గ ఫలితాల కోసం కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లిన వారి సెల్ నంబర్లు తీసుకున్నారు.

**ప్రత్యేక పోలీస్ బందోబస్తు**

ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా ముందస్తుగా ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు డీఎస్పీ కేవీ రమణ తెలిపారు. పోలింగ్‌కు ముందు నుంచీ నియోజకవర్గంలోని గుర్తించిన పలు సమస్యాత్మక గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ నిఘా, గస్తీ కొనసాగుతుందన్నారు. ముఖ్యంగా ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని ఊరేగింపులు, బాణసంచా కాల్పులు, విజయోత్సవాలకు అనుమతులు లేవన్నారు. ప్రత్యేక పోలీస్ ఫోర్స్ సిద్ధం చేశామని, మొబైల్ టీమ్ తిరుగుతుందని తెలిపారు. ఎక్కడ ఏ చిన్న సంఘటన చోటు చేసుకున్నా వెంటనే అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చేలా చర్యలు తీసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు.

## కౌంటింగ్ డౌన్ స్టార్ట్



శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్‌ఓ శ్రీరామచంద్రమూర్తి

మామిడికుదురు: ప్రజలు ఎంతో ఉత్కంఠతతో ఎదురూ చూస్తున్న ఎన్నికల కౌంటింగ్‌కు కౌంట్ డౌన్ మొదలైంది. మరికొన్ని గంటల్లో కౌంటింగ్ ప్రారంభం కాబోతుంది. కౌంటింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో పి.గన్నవరం నియోజకవర్గం ఎన్నికల కౌంటింగ్ నిర్వహించనున్నారు. మొత్తం 18 రౌండ్లలో ఎన్నికల కౌంటింగ్ పూర్తి చేసేందుకు కార్యాచరణ పూర్తి చేశారు. కౌంటింగ్‌కు గాను మొత్తం 12 టేబుల్స్ ఏర్పాటు చేశారు. పి.గన్నవరం నియోజకవర్గంలో మొత్తం 212 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. పి.గన్నవరం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 1,98,602 మంది ఉన్నారు. వారిలో 1,65,749 మంది ఓట్లు వేశారు. నియోజకవర్గంలో 83.46 శాతం పోలింగ్ నమోదైంది. 2,869 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మామిడికుదురు మండలం ఆదుర్రు గ్రామం నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. వరుసగా మామిడికుదురు, పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి మండలాల్లో ఈవీఎంలను లెక్కిస్తారు. అయినవిల్లి పొట్టిలంక గ్రామంలో కౌంటింగ్ ముగుస్తుంది. పి.గన్నవరం నియోజకవర్గంలో పోటీ హోరా హోరీగా జరిగింది. వైఎస్సార్ సీపీ నుంచి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, కూటమి తరపున జనసేన అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ పోటీ చేశారు. ఎనిమిది గంటల్లో కౌంటింగ్ పూర్తి అవుతుందని ఎన్నికల సంఘం అధికారులు అంచనా వేస్తున్నారు.

## వాడపాలెంలో యోగా శిక్షణ తరగతులు

కొత్తపేట: సంపూర్ణ ఆరోగ్యం, శారీరక, మానసిక ఉల్లాసానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని పూర్వపు జాతీయ క్రీడాకారుడు చీకట్ల రామారావు, రిటైర్డ్ పీఈటీ మారిశెట్టి సత్యనారాయణ అన్నారు. వాడపాలెం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గ్రామ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీఘాకోళ్లపు భీమేశ్వర రావు సౌజన్యంతో కొత్తపేట స్వామి వివేకానంద యోగా ఆశ్రమం నిర్వాహకుడు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఉచిత యోగా శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ తరగతులను చీకట్ల రామారావు, మారిశెట్టి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి నిత్య జీవితంలో వ్యాయామం అవసరమన్నారు. యోగా లేదా వ్యాయామంతో అనారోగ్య రుగ్మతలు తొలగిపోయి ఆరోగ్యానికి దోహదపడుతుందన్నారు. యోగా మాస్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ యోగా శిక్షణ తరగతులు నిత్యం జరుగుతాయన్నారు. ఆరోగ్యంపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గనిశెట్టి గోవిందరాజు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీఘాకోళ్లపు భీమేశ్వరరావు, సభ్యులు సుతాపల్లి వెంకటసుబ్బారావు, ఆకుమూరి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు బలగాల మోహరింపు



ఆలమూరులో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

ఆలమూరు: సార్వత్రిక ఎన్నికల లెక్కింపు దృష్ట్యా మండలంలోని పోలీసులు భారీగా మోహరించారు. ఇప్పటికే పోలీసుస్టేషన్ పరిధిలో 144, 30 సెక్షన్లు అమలులో ఉందంటూ ఎస్సై ఎల్.శ్రీను నాయక్ నేతృత్వంలో పోలీసుల బృందం ఆటోల ద్వారా ప్రచారం నిర్వహించారు. ఇప్పటికే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మద్యం దుకాణాలను మూయించి వేశారు. ఈ సందర్భంగా సీఆర్‌పీఎఫ్ బలగాలకు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, ప్రతి ఒక్కరూ నియంత్రణ పాటించాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు. అనంతరం పోలీసుల బృందం గ్రామాల్లో పహరా నిర్వహించారు.

## కేసుల్లో ఇరుక్కొని భవిష్యత్ నాశనం చేసుకోవద్దు

అంబాజీపేట: ఎలక్షన్ కేసుల్లో ఇరుక్కొని యువత బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని ఎస్సై కె.చిరంజీవి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు సందర్భంగా సెక్షన్ 144, 30 పోలీస్ యాక్టు, ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. నలుగురు, అంతకంటే ఎక్కువ మంది గుమ్మిగూడి ఉండకూడదన్నారు. ఫలితాలు వచ్చే సమయంలోను, వచ్చిన తరువాత ఎటువంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతులు లేవన్నారు. బాణా సంచాకాల్చడం, బైక్ ర్యాలీలు చేయడం, మోటారు సైకిళ్ల సైలెన్సర్లు తీసి నడపడం వంటివి చేయకూడదన్నారు. ఎన్నికల్లో గెలిచిన ఓడిన వారిని కించపరిచేలా వాట్సప్‌లో పోస్టింగ్‌లు పెట్టరాదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కౌంటింగ్ నేపథ్యంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి వివాదాలు, అల్లర్లు చేసేవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

## అనధికార మద్యం దుకాణంపై దాడి



నిందితుడు, స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై శ్రీనునాయక్

ఆలమూరు: స్థానిక కొత్తూరు సెంటర్‌లో విక్రయిస్తున్న అనధికార మద్యం దుకాణంపై ఆలమూరు పోలీసులు సోమవారం రాత్రి దాడి చేశారు. స్థానిక ఎస్సై ఎల్.శ్రీను నాయక్ కథనం ప్రకారం.. ఓట్ల లెక్కింపు దృష్ట్యా మూడు రోజుల పాటు మద్యం విక్రయాలను ప్రభుత్వ నిషేధించింది. దీన్ని ఆసరాగా తీసుకున్న జి.వెంకటరమణ అప్పటికే నిల్వ చేసుకున్న మద్యం బాటిళ్లను అధిక ధరకు విక్రయిస్తున్నాడు. దీనిపై అందిన సమాచారం మేరకు ఎస్సై నేతృత్వంలోని పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి వెంకటరమణను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 40 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈమేరకు కేసును నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీను నాయక్ తెలిపారు.

## జగన్ మళ్లీ సీఎం కావాలని పూజలు



అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో పూజలు చేస్తున్న శిరీష్

అయినవిల్లి: రాష్ట్ర సీఎంగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవ్వాలని డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదిటి శిరీష్, జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడు తోరం గౌతమ్, రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి జిల్లెల రమేష్ ఆధ్వర్యంలో అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి వారికి సోమవారం పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పైనే ఆధారపడి ఉందని, ఆయన తప్ప మరే నాయకులు న్యాయం చేయలేరని వారు అన్నారు. వారి వెంట వైఎస్సార్ సీపీ నేత శ్రీరెడ్డి సుబ్బారావు తదితరులు ఉన్నారు. చిర్ల జగ్గిరెడ్డి విజయం సాధించాలని వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ రమేష్‌రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పూజలు చేశారు.

## విద్యార్థులతో సైంటిఫిక్ మ్యాజిక్

అమలాపురం టౌన్: స్థానిక సూర్యనగర్‌లోని గోపాలకృష్ణ గోఖలే మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న బాలల వేసవి వినోద కేంద్రంలో మూడో రోజు సోమవారం మెజీషియన్ సైంటిఫిక్ మ్యాజిక్ షోను నిర్వహించారు. సైంటిఫిక్ మెజీషియన్ కాటూరు నాగేశ్వరరావు చేసిన పలు ప్రదర్శనలు విద్యార్థులను ఆలోచింపచేశాయి. ప్రతి మ్యాజిక్ వెనుక సైన్స్ ఉందని స్పష్టం చేస్తూ తన ప్రదర్శనల ద్వారా విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. కొన్ని ప్రదర్శనలను విద్యార్థులతో చేయించారు. అనంతరం మెజీషియన్ నాగేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.సత్యనారాయణ, యూటీఎఫ్ సీనియర్ నాయకుడు మామిడిశెట్టి వెంకటేశ్వరరావు, జేవీవీ ఆడిట్ కమిటీ కన్వీనర్ బీఎస్ వెంకటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

# విత్తనాల ఎంపికే కీలకం

- ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల కొనుగోలులో అప్రమత్తత అవసరం
- సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు
- ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులు



ఇరుసుమండలో వరి నారుమడికి సిద్ధం చేసిన పొలం

అంబాజీపేట: రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. అడపా దడపా వర్షాలు కురుస్తున్నాయి. అలాగే పంట కాలువ సాగునీరు విడుదల చేయడం చేస్తున్నారు. దీంతో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే కొందరు దుక్కులు చేసి నారుమడికి సిద్ధం చూస్తున్నారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు కొనుగోలుకు సన్నద్ధమవుతున్నారు. వ్యవసాయ సాగులో విత్తనాల ఎంపికే కీలకమని, పురుగు మందులు, ఎరువులు కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయించే డీలర్లు తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఆర్బీకేల వద్ద ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయడం మేలని సూచిస్తున్నారు.

**గుర్తింపు పొందిన సంస్థల వద్దే కొనాలి**

వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన డీలర్, గుర్తింపు పొందిన సంస్థల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. విత్తనాల సంచిపై విత్తన రకం, ల్యాబ్ నంబర్, గడువు తేదీ తదితర విషయాలు ఉన్నవీలేనివి తప్పనిసరిగా గమనించాలి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన బిల్లలపై తప్పనిసరిగా డీలరు సంతకం ఉండాలి. రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి. హైబ్రీడ్ విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు విత్తనం రకం, స్వచ్ఛత, మొలకెత్తే స్వభావం, జన్య నాణ్యత వంటి వివరాలను నిర్ధారించుకోవాలి. పి.గన్నవరం నియోజకవర్గంలో 613 హెక్టార్లు, కొత్తపేట నియోజకవర్గంలో 780 హెక్టార్లు, రాజోలు నియోజకవర్గంలో 976 హెక్టార్లలో వరి సాగు చేపట్టనున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రాంతానికి అనుకూలమైన ఎంటీయూ 7029, 1064, ఎంటీయూ 1318 రకాలను ఎంపిక చేసుకోవాలి.

**విత్తన శుద్ధి ఇలా..**

కిలో విత్తనాలు రెండున్న గ్రాముల కార్బన్‌డైజం కలిపి 24 గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. నీటిలో నానబెడితే లీటరు నీటికి ఒక గ్రాము కార్బండైజం కలిపి ఆ ద్రవణంలో 24 గంటలు నానబెట్టి మడి కట్టి నారుమడిలో చల్లుకోవాలి. విత్తనం నానబెట్టడానికి ఒక కిలో విత్తనానికి ఒక లీటరు నీరు సరిపోతుంది. కార్బండైజం కాకుండా విత్తన శుద్ధికి సూడోమోనాస్ ఫ్లోరసెస్ అనే జీవ శిలీంద్ర నాశినిని కూడా ఉపయోగించవచ్చు. సూడోమోనాస్ ఫ్లోరసెస్ మందును కేజీ విత్తనాలకు 8 గ్రాముల మందును వినియోగించాలి. దీని వల్ల విత్తనం ద్వారా, భూమి నుంచి శిలింద్రం ద్వారా వచ్చే తెగుళ్లను అరికట్టవచ్చు.

**మొలక పరీక్ష తప్పనిసరి**



రైతులు సొంత విత్తనాలు వినియోగించుకోవడం మంచిది. మొలక పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలి. రైతు కొనుగోలు చేసిన విత్తనాల సంచి నుంచి 100 గింజలను 24 గంటల పాటు నీటిలో నానబెట్టి, అనంతరం ఒక గుడ్డలో కట్టాలి. వెలుతురు తగలని ప్రదేశంలో ఉంచాలి. 24 గంటల తర్వాత తీసి చూస్తూ 100 గింజలకు 80 శాతం గింజల పైబడి మొలకవస్తే మంచిది.

– సీహెచ్.డి.విజయ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి, అంబాజీపేట

### వైఎస్సార్ సీపీదే విజయం

రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నరసింహరాజు



నరసింహరాజు

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో తిరిగి అధికారం చేపడుతుందని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కమిటీ సంయుక్త కార్యదర్శి ఇందుకూరి నరసింహరాజు సోమవారం ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు మాటలను, హామీలను ప్రజలు నమ్మలేదన్నారు. ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమం చూసి భారీగా ఓటింగ్‌లో పాల్గొన్నారని, మహిళలు మరింత ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొని వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఓట్లు వేశారన్నారు. కౌంటింగ్ అనంతరం అన్ని పార్టీల నేతలు, కార్యకర్తలు సామరస్యంగా ఉండాలని, సోదరభావంతో మెలిగి అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించాలని నరసింహరాజు సూచించారు. అధికారులకు అండగా నిలిచి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.

### రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న మంత్రి విశ్వరూప్



నందంపూడిలో స్వామి వారిని దర్శించిన అనంతరం స్థానిక నాయకులతో మంత్రి విశ్వరూప్

అంబాజీపేట: నందంపూడిలో ఉన్న ఉమారామలింగేశ్వర స్వామి వారిని మంత్రి పినిపే విశ్వరూప్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు యలమంచిలి సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. మంగళవారం జరిగే ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మంత్రి విశ్వరూప్ ఆలయాన్ని సందర్శించుకోవడం ప్రాముఖ్యతను సంతరించుకుంది. అనంతరం విశ్వరూప్‌ను పార్టీ నాయకులు సత్కరించారు. స్వామి వారిని దర్శించుకున్న వారిలో వైఎస్సార్‌సీపీ ఉభయ గోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్, నాగాబత్తుల సందీప్, కూరాకుల వెంకయ్య, నాగాబత్తుల శశి తదితరులు ఉన్నారు.

### అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

అంబాజీపేట: వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులలో భాగంగా సోమవారం అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రను గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ విద్యార్థులకు వివరించారు. మహనీయుల చరిత్రను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. అనంతరం వివిధ జంతువుల పేర్లు, దేశాలు వాటి రాజధానులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

### రికార్డుల పరిశీలన



ఆలమూరులో రికార్డులు పరిశీలిస్తున్న వైద్యాధికారి సాయికిషోర్

ఆలమూరు: మండలంలోని ఆలమూరు, జొన్నాడ, పెనికేరు తదితర గ్రామాల్లో ఉన్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో రికార్డుల పరిశీలన జరిగింది. పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సాయి కిషోర్ ఆయా కేంద్రాలకు వెళ్లి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి వైద్యారోగ్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందజేశారు. సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ బస్‌పాస్ కౌంటర్లకు సెలవు

రామచంద్రపురం రూరల్: ఏపీఎస్ఆర్టీసీ రామచంద్రపురం డిపోలో బస్ పాస్ కౌంటర్లు ఈ నెల 6, 7వ తేదీల్లో పని చేయవని డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్‌పాస్‌లు నమోదు చేసే ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌ను ఆధునీకరించి, కొత్త సాఫ్ట్‌వేర్‌కు మార్చుతున్నందున సెలవు ఇచ్చినట్టు తెలిపారు. ఆర్టీసీ ప్రయాణికులు సహకరించాలని కోరారు.